# పాఠశాలలకు నిర్వహణ, క్రీడా నిధులు

- వికారాబాద్ జిల్లాకు రూ.3.84 కోట్లు మంజూరు
- 1004 పాఠశాలల నిర్వహణ కోసం రూ.2.90 కోట్లు
- క్రీడా నిధులు రూ.93,20,000
- ప్రస్తుతం 50 శాతం నిధులు రూ.1.92 కోట్లు విడుదల
- మిగతా 50 శాతం నిధులు డిసెంబర్‌లో..




బొంరాస్‌పేట, అక్టోబర్ 1 : పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేసేందుకు ఇబ్బందులుపడ్డారు. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ నిధులను మంజూరు చేయడంతో కష్టాలు తీరనున్నాయి. మొదటి విడతగా 50 శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు విడుదల చేయడంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కలిగిందని ప్రధానోపాధ్యాయులు భావిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను సర్కారు బడుల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవలే నిధులను మంజూరు చేసింది. పాఠశాలలో కనీస అవసరాలైన చాక్‌పీస్‌లు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి మరమ్మతు పనులు, ఇంటర్‌నెట్, ప్రయోగశాలల పరికరాలు, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఏటా ప్రభుత్వం పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తున్నది. జిల్లాలోని 1004 ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ నిధులు, క్రీడా నిధులు కలిపి రూ.3.84 కోట్లను మంజూరు చేసింది. వీటిలో పాఠశాల నిర్వహణ కోసం రూ.2.90 కోట్లు కాగా, క్రీడా నిధులు రూ.93,20,000 ఉన్నాయి. వీటిలో 50 శాతం నిధులను రూ.1.92 కోట్లను విడుదల చేశారు. మిగతా 50 శాతం నిధులను డిసెంబర్‌లో విడుదల చేస్తారు.

ప్రాథమిక పాఠశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేలను కేటాయించారు. ఏయే పరికరానికి ఎంతెంత వెచ్చించాలన్న వివరాలను అధికారులు ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

## మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రూ.1.36 కోట్లు విడుదల

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఆగస్టు నెల వరకు ఉన్న అన్ని బకాయి బిల్లులను ప్రభుత్వం మంజూరు చేసింది. వికారాబాద్ జిల్లాకు రూ.1.36 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో 1 నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజనం బిల్లులు, మధ్యాహ్న భోజనం చేసే కార్మికుల వేతనాలు రూ.76,52,608, గుడ్లు అందించడానికి రూ.60,05,000లను ప్రభుత్వం విడుదల చేసింది.



తుంకిమెట్ల అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ చిన్నారులకు పంపిణీ చేసిన నోటుపుస్తకాలు, పెన్నులు

# అంగన్‌వాడీ కేంద్రాలకు కిచెన్ ప్లాట్‌ఫాంలు మంజూరు

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

బొంరాస్‌పేట/కొడంగల్, అక్టోబర్ 1 : మండలంలోని 57 అంగన్‌వాడీ కేంద్రాలకు కిచెన్ ప్లాట్‌ఫాంలు మంజూరు చేస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ చెప్పారు. మంగళవారం బొంరాస్‌పేట మండలంలోని జానకంపల్లి, సూర్యానాయక్‌తండా, తుంకిమెట్ల గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటలు చేయడానికి కిచెన్ ప్లాట్‌ఫాంలు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ మండలంలోని ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి కిచెన్ ప్లాట్‌ఫాంల నిర్మాణానికి రూ.7వేలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వెంటనే ప్లాట్‌ఫాంలు నిర్మించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను బిగించాలన్నారు. తుంకిమెట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడి నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి బాగా చదువుకోవాలని సూచించారు. బొంరాస్‌పేట నుంచి మహంతీపూర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కొడంగల్‌లోని పాతకొడంగల్‌లో అంగన్‌వాడీ కేంద్రం, యూపీఎస్, ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి
- రెండు పడక గదులు పంపిణీ చేయాలి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

వికారాబాద్, అక్టోబర్ 1 : కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఆయా జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడక గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలన్నారు. దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు.

సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 8 వరకు ఇది పూర్తి చేయాలని, 9న డ్రాఫ్ట్ రెడీ ఉంటుందని పేర్కొన్నారు. 10న రిపోర్ట్ సబ్మిట్ ఉంటుందని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా మిగతా సర్వే పనులపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఏయే జిల్లాల్లో ఎన్ని ఉన్నాయి? ఎన్ని పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తుల నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని రెండు పడక గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తి చేసి, త్వరలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 అదనంగా అందజేయనుందని తెలిపారు. సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న వడ్లలో దొడ్డు వడ్లు కలవకుండా చూసుకోవాలని, వ్యవసాయ అధికారి పరిశీలించిన తర్వాత వాటిని పంపాలని పేర్కొన్నారు. రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి, సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు తదితరులు

## కేటీఆర్ కాన్వాయిపై దాడి గర్హనీయం

**వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**



వికారాబాద్, అక్టోబర్ 1 : హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో నిరుపేదల ఇండ్లు కూల్చడంతో మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ రౌడీలు దాడి చేయడం గర్హనీయమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచక ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వానికి వీలైతే వెంటనే వారికి ప్రత్యామ్నాయాన్ని చూపించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడి చేస్తుంటే చూసి రాక్షసానందం పొందటం మానుకోవాలని మండిపడ్డారు. ఇలాంటి దాడులు బీఆర్ఎస్ నాయకులను ప్రజల వద్దకు వెళ్లకుండా ఆపలేవన్నారు.

## స్వతహాగా నిథిమ్ భవన నిర్మాణం కూల్చివేత

మాదాపూర్, అక్టోబర్ 1: గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (నిథిమ్) లో చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని మంగళవారం నిథిమ్ యాజమాన్యం స్వతహాగా కూల్చివేసింది. శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గచ్చిబౌలి సర్వే నంబర్ 71లో 3 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రాయసముద్రం చెరువు ఉంది. చెరువు ఎఫ్‌టీఎల్‌తో కలుపుకొని దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంతో ఉన్నది. ఈ చెరువును ఆక్రమించి నిథిమ్ క్యాంపస్ ఉండగా.. కొన్నేండ్ల కిందట నిథిమ్ యాజమాన్యం చెరువును పూడ్చి.. నూతనంగా భవన నిర్మాణం చేపట్టగా.. పలు స్వచ్ఛంద సంస్థలు కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కాగా, హైకోర్టు భవనాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో.. నిథిమ్ యాజమాన్యం ఆ భవనం కూల్చివేత పనులను స్వతహాగా చేపట్టింది.

# ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- మర్పల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ



మర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

మర్పల్లి, అక్టోబర్ 1 : ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మర్పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని గదులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకత, యూఐ పెండింగ్ గురించి, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆత్మహత్యలు చేసుకోకుండా గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ టీవీలు మొదలగు విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆన్‌లైన్‌లో ఎలాంటి ఫైల్స్ పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని, డయల్ 100పై వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సురేశ్, సిబ్బంది ఉన్నారు.

# నగలను కాజేసేందుకు ఒంటరి మహిళ హత్య

- షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి
- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు జోగులాంబ గద్వాల జిల్లా చాగాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు



హత్య వివరాలను తెలుపుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, అక్టోబర్ 1 : వివాహేతర సంబంధాన్ని కొనసాగించడంతోపాటు ఓ మహిళ ఒంటిపై ఉన్న నగలను కాజేసేందుకు పథకం వేసిన ఓ అడ్డా కూలీ ఆమెను హత్య చేసిన ఘటన షాద్‌నగర్‌లో వెలుగుచూసింది. నాలుగు రోజుల క్రితం షాద్‌నగర్‌లోని శ్రీనివాస కాలనీలో గుర్తు తెలియని మహిళను హత్యచేసి ఓ సంచిలో మూటగట్టి పడేసిన ఘటనపై షాద్‌నగర్ పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కేసును ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏసీపీ రంగస్వామి కేసు వివరాలను విలేకరులకు వివరించారు.

చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కన్నా భాగ్యలక్ష్మి తన భర్తతో దూరంగా ఉంటూ గత కొన్నాళ్లుగా షాద్‌నగర్‌లోని అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్నది. రోజువారీ కూలీగా ఉపాధి పొందుతున్నది. ఈ నేపథ్యంలో జోగులాంబ జిల్లా ఇటిక్యాల మండలం చాగాపూర్ గ్రామానికి చెందిన వడ్డె పరమేశ్ అనే అడ్డా కూలీతో పరిచయం ఏర్పడింది. పరమేశ్ చెడు వ్యసనాలకు బానిస కావడం.. దీంతో విసుగు చెందిన అతడి భార్య సొంత గ్రామానికి వెళ్లిపోవడంతో అతడు కూడా ఫరూఖ్‌నగర్ యాదవ్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి ఒంటరిగా నివాసం ఉంటున్నదని తెలుసుకున్న పరమేశ్ ఆమెతో మరింత చనువు పెంచుకున్నాడు. ఇరువురి పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ నెల 27న ఇరువురు కలిసి కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి గ్రామంలో కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. భాగ్యలక్ష్మి ఒంటరిగా ఉంటుంది, ఆమెను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను, దాచుకున్న డబ్బులను దోచుకుంటే ఎవ్వరూ పట్టించుకోరనే క్రూరబుద్ధితో ఆమెను హత్య చేసేందుకు పథకం వేశాడు. అదే రోజు రాత్రి తన అద్దె గదికి తీసుకెళ్లి గొంతు నులిమి భాగ్యలక్ష్మిని హత్య చేశాడు. అనంతరం చెత్తను నిల్వచేసే ప్లాస్టిక్ సంచిలో మృతదేహాన్ని మూటగట్టి ఆమె నివాసముండే ఇంటి సమీపంలో అర్ధరాత్రి పడేసి ఎప్పటిలాగే తన గదికి వెళ్లిపోయాడు.

ఈ విషయమై గత నెల 27న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా.. వివిధ ఆధారాలతో హత్యకు పాల్పడింది పరమేశ్ అనే విషయాన్ని గుర్తించామని ఏసీపీ వివరించారు. కేవలం ఒంటరి మహిళ అనే విషయాన్ని ఆసరాగా చేసుకొని ఆమె ఒంటిపై ఉన్న బంగారు వస్తువుల కోసం హత్యకు పాల్పడ్డాడని వివరించారు. నిందితుడు పరమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఒంటరి మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. కేసు ఛేదనలో షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ బృందం ఉత్తమ ప్రతిభను చూపారని ప్రశంసించారు. కేసులో భాగస్వాములైన సిబ్బందికి రివార్డులను అందజేశారు.

## శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణా కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులతో అధికారులు, నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 1 : కార్మిక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీలోని వంపుగూడెంలో, కార్మిక శాఖ న్యాక్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇండ్ల నిర్మాణాలపై, కార్మికులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కార్మికులకు 15 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పోతుగంటి అశోక్ తన సొంత డబ్బులతో సమకూర్చిన 50 లేబర్ కార్డులను కూలీలకు అందజేశారు. కార్యక్రమంలో న్యాక్ ఈడీ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

## బీసీఏ రీవాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే రూ.200 అపరాధ రుసుముతో కలిపి ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించాలని అన్నారు. ఈ నెల 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

## ఎంఏ ఓరియంటల్ పరీక్షా తేదీల ఖరారు

ఓయూ : ఓయూ పరిధిలోని ఎంఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ 2, 4 సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్షలను 17 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

## ఘనంగా జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు




విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన అధికారులు

వికారాబాద్, అక్టోబర్ 1 : జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని కలెక్టర్ ఆఫీస్‌లో అక్టోబర్ 1న వన్యప్రాణి అవగాహన కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని హైస్కూళ్లలో మండలాలవారీగా విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఎంఈవోలు ఈ పోటీలను నిర్వహించారు.

మండలాలవారీగా ఉత్తమ పెయింటింగ్, ఉత్తమ వ్యాసరచనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు ఐసీఓడీ మీటింగ్ హాల్‌లో బహుమతులను ప్రదానం చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వన్యప్రాణులు, ప్రకృతి పట్ల అవగాహన చాలా ముఖ్యమని.. అది భవిష్యత్తు తరాలకు చాలా అవసరమన్నారు. డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. మనిషి ప్రకృతిలో భాగం కాబట్టి ప్రకృతిని సంరక్షించినప్పుడే మానవుడు కూడా సంరక్షించబడతాడని చెప్పారు. కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులు, ఆయా పాఠశాల టీచర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.



వరద ఉధృతి పెరగడంతో గండిపేట నుంచి వదులుతున్న నీరు

# మూసీకి పోటెత్తిన వరద

**జంట జలాశయాల గేట్లు ఎత్తివేత**

**పరీవాహక ప్రాంత ప్రజలను అలర్ట్ చేసిన అధికారులు**

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీకి వరద పోటెత్తింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి జంట జలాశయాలకు వరద ఉధృతి పెరుగుతున్నది. అధికారులు జలాశయాల గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ రెండు జలాశయాల్లోకి 1750 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు అలర్ట్ ప్రకటించారు. మంగళవారం జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ 6 గేట్లను ఎత్తివేశారు. హిమాయత్‌సాగర్ ఒక గేట్ ఎత్తారు. ఉస్మాన్‌సాగర్ ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 1428 క్యూసెక్కులుగా ఉంది. దీంతో అధికారులు ఉస్మాన్‌సాగర్ 6 గేట్లను రెండు ఫీట్ల మేర ఎత్తారు. హిమాయత్‌సాగర్ ఒక గేటు ఒక అడుగుమేర ఎత్తి 348 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జంట జలాశయాల నుంచి 1776 క్యూసెక్కుల వరదనీటిని మూసీనదిలోకి విడుదల చేస్తున్నారు. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో మూసీనది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ లైటులో గుండె చప్పుడు!

- సైబరాబాద్ అంతటా రెడ్ హార్ట్ ట్రాఫిక్ లైట్స్
- వంద ట్రాఫిక్‌లైట్స్ ఏర్పాటుచేసిన స్టార్ హాస్పిటల్
- గుండె ఆరోగ్యంపై వాహనదారులకు అవగాహన




హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): 'గుండెను పదిలంగా కాపాడుకోవాలి' అని గుర్తుచేసేలా సైబరాబాద్ అంతటా రెడ్ హార్ట్ ట్రాఫిక్ లైట్లు వెలిశాయి. మరణాల్లో గుండెకు సంబంధించినవే అత్యధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమ గుండెను కాపాడుకునేందుకు సమయం కేటాయించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తూ ఈ వినూత్న కార్యక్రమానికి స్టార్ హాస్పిటల్ శ్రీకారం చుట్టింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో సైబరాబాద్‌లోని వంద ట్రాఫిక్ సిగ్నల్స్‌లో రెడ్ లైట్లకు హార్ట్ ఆకారాన్ని జోడించారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒక్క ట్రాఫిక్ సిగ్నల్ వద్ద మాత్రమే వాహనదారులు అర నిమిషం ఆగుతారు. ఈ కాస్త సమయంలో మన ఆరోగ్యం ఎలా ఉన్నది? మన ప్రాణాలు నిలిపే మన గుండె ఎలా పని చేస్తుంది? అన్నది ఆలోచించుకునేలా ఈ రెడ్ హార్ట్‌ను అమర్చారు.

### ఎందుకు ఈ రెడ్ హార్ట్?

శరీరంలోని అన్ని భాగాలు రోజూ ఏదో ఒక సమయంలో విశ్రాంతి తీసుకుంటాయి. ఒక్క గుండె తప్ప. అమ్మ కడుపులో నాలుగు వారాలకు కొట్టుకోవడం మొదలై.. నిర్విరామంగా పనిచేస్తూనే ఉంటుంది. అది ఒక్క క్షణం లయ తప్పితే జీవితం తలకిందులైపోతుంది. అలాంటి గుండెను ఎంత పదిలంగా చూసుకోవాలి! ఇటీవల వయసుతో సంబంధం లేకుండా సంభవిస్తున్న మరణాలకు గుండెపోటే ప్రధాన కారణం కావటం ఆందోళన కలిగిస్తున్నది. అందుకే మన గుండె ఆరోగ్యాన్ని గుర్తుచేసేలా స్టార్ హాస్పిటల్ వైద్యులు రెడ్ హార్ట్ ట్రాఫిక్ లైట్‌తో అవగాహన కల్పిస్తున్నారు. ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వీటిని ఏర్పాటు చేశారు.

# యాసంగి వచ్చే.. రైతు భరోసా అందకపాయే..

**ఎన్నికల ముందు ఇచ్చిన మాట మార్చిన కాంగ్రెస్ సర్కారు**

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 1 : కాంగ్రెస్ పార్టీ రైతులకు రైతు భరోసా పేరుతో పంటల సాగుకు ఆర్థిక సాయం అందజేస్తామని ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఉత్తమ రైతు మొద్దు అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపక్క వర్షాకాలం పంటల సాగు ముగిసి.. యాసంగి ప్రారంభమవుతున్నప్పటికీ నేటికీ రైతు భరోసా అందించకపోవడం సిగ్గుచేటన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగు కోసం రైతు బంధు అందేదని, దీంతో రైతులు సంతోషంగా పంటల సాగు చేసుకున్నారన్నారు. కాని, ఇప్పుడు రైతులకు మళ్లీ పాత రోజులు వచ్చి కూలీ పనులకు పోవడంతోపాటు అధిక వడ్డీలకు అప్పులుచేసి పంటలు సాగుచేసుకోవల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. రైతుల ప్రభుత్వం అంటూనే రైతుల పొట్టగొడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారుపై రైతులు దుమ్మెత్తిపోస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## టీ హబ్‌లో స్ట్రాటజిక్ ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సమస్య ఏదైనా.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చక్కని పరిష్కార మార్గాలను కనిపెట్టడమే లక్ష్యంగా స్టార్టప్ కార్యకలాపాలు విస్తృతమవుతున్నాయి. వివిధ రంగాల్లోని పరిశ్రమల వాస్తవిక పరిస్థితులు, వ్యాపారాల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు టీ హబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని స్ట్రాటజిక్ ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ (వ్యూహాత్మక పరివర్తన కమిటీ) పేరుతో ఏర్పాటు చేసింది. నూతన ఆవిష్కరణలు, వ్యాపార వ్యూహాలన్నీ వినూత్నంగా తీర్చిదిద్దేందుకు పరిశ్రమలకు చెందిన నిపుణులతో కలిసి ఏర్పాటు చేస్తున్న ఈ కమిటీ కొత్త స్టార్టప్‌ల ఏర్పాటు కోసం అవసరమైన సమాచారాన్ని, ఆయా రంగాల్లో ఉన్న అవకాశాలను తెలియజేసేందుకు పనిచేస్తుందని టీహబ్ నిర్వాహకులు తెలిపారు.